క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి బుధవారంలాగే ఈ వారం కూడా భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బాలికలకు ఇంటర్న్‌షిప్



పిల్లలకు గైడెన్స్ ఇస్తున్న ఒకేషనల్ ట్రైనర్ సంధ్య

దాబాగార్డెన్స్: పాతనగరంలో గల ప్రభుత్వ క్వీన్ మేరీస్ బాలికోన్నత పాఠశాల బాలికలకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా వృత్తి విద్యా కోర్సులు (ఐటీ/ఐటీఈఎస్)కు సంబంధించి సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వృత్తి విద్య భవిష్యత్‌లో అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. జోగేంద్రనాథ్ పేర్కొన్నారు. విశాఖ జీసీడీవో ఖలేషా బేగం, విశాఖ డిస్ట్రిక్ట్ ఒకేషనల్ కో ఆర్డినేటర్ రిషి మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సు పూర్తి చేసి ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా భవిష్యత్‌లో విద్యార్థులు త్వరగా ఉన్నత స్థాయికి వెళ్తారని తెలిపారు. ఒకేషనల్ ట్రైనర్ రెల్లి సంధ్య పిల్లలకు గైడెన్స్ అందజేశారు.

ఒకేషనల్ కోర్సుల్లో నాణ్యమైన శిక్షణ



ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తున్న బోర్డ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

ఆరిలోవ: బీవీకే విద్యా సంస్థలో ఒకేషనల్ కోర్సుల్లో నాణ్యమైన శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థల బోర్డ్ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కళాశాల ఒకేషనల్ కోర్సుల ఫస్టియర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం కళాశాలను సందర్శించి ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. ఇక్కడ ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. ప్రస్తుతం ఒకేషనల్ కోర్సులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఇక్కడ ఒకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట రమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు



కేఆర్ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మద్దిలపాలెం: విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీవో ఎంవీ రమణకుమారి, ఏసీడీపీవో శ్రీలత ఆదేశాల మేరకు పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మద్దిలపాలెం కేఆర్ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ సంరక్షణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించామని అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి తెలిపారు. వెయ్యి రోజుల పోషణ సంరక్షణలో తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలను పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలకు వివరించారన్నారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

ఎన్నికల్లో హామీ ఇచ్చి కప్పదాట్లు వేస్తున్న సీఎం **చంద్రబాబు**

భవన నిర్మాణ కార్మికులకు కొరవడిన భద్రత

సాయం అందక.. పనుల్లేక ఇంటిల్లిపాదీ **పస్తులు**

సంక్షేమ బోర్డు లేక కానరాని **చేయూత**

కార్మిక సోదరా.. కష్టం తీరదా?



రెక్కాడితే కానీ డొక్కాడని భవన నిర్మాణ కార్మికులు



డిమాండ్ల సాధనకు నిరసన తెలుపుతున్న ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్లు (ఫైల్)

దాబాగార్డెన్స్:

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం.. కార్మిక వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరిస్తాం.. సహజ మరణానికి రూ.60 వేలు.. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు.. అదనంగా మట్టి ఖర్చులకు మరో రూ.20వేలు.. ఇవి కాక మహిళా కార్మికుల తొలి కాన్పుకు రూ.20 వేలు.. రెండో కాన్పుకు కూడా రూ.20 వేలు చెల్లిస్తాం. అంగ వైకల్యం పొందితే రూ.5 లక్షలు.. ఎన్నికల వేళ ఇలా ఎన్నో హామీలు గుప్పించారు కూటమి నాయకులు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 10 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు కాలేదు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. తమ రెక్కల కష్టాన్ని నమ్ముకుని, ఇంటిల్లిపాదిని పోషించుకుంటున్నారు. నిత్యం శ్రమిస్తేనే యావత్ కుటుంబం కలో గంజో తాగేది. అలాంటి కష్టజీవులు పనుల్లేక రోడ్డున పడ్డారు. ఇప్పటి వరకు ఇసుక కొరత.. భవన నిర్మాణ సామగ్రి ధరలకు రెక్కల ఫలితంగా ప్రత్యక్షంగా.. పరోక్షంగా భవన నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్న కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు కమ్ముకున్నాయి.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలివే..

ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని, సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుడు సహజ మరణం పొందితే రూ.60 వేలు.. మట్టి ఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తామన్నారు. పని చేసే ప్రాంతంలో ప్రమాదం జరిగి కార్మికుడు మృతి చెందితే రూ.5 లక్షలతో పాటు మరో రూ.20 వేలు మట్టి ఖర్చుల కింద చెల్లిస్తామన్నారు. ప్రమాదం జరిగి పూర్తిగా అంగవైకల్యం పొందితే రూ. 5 లక్షలు, పాక్షికంగా ప్రమాదం జరిగితే.. పర్సంటేజీ బట్టి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇది కాకుండా మహిళా కార్మికులకు తొలి కాన్పుకు, మలి కాన్పుకు కూడా రూ.20 వేలు చొప్పున చెల్లిస్తామన్నారు. కార్మికుడు అనారోగ్యంతో ఆస్పత్రి పాలైతే నెలకు రూ.3 వేలు చొప్పున పరిహారం అందిస్తామన్నారు. 60 ఏళ్ల దాటిన వృద్ధ కార్మికులకు పెన్షన్ రూపంలో సంక్షేమ బోర్డు ద్వారా సాయం అందిస్తామన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 10 నెలలయింది. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు సరికదా.. ఆ ఊసే ఎత్తకపోవడంతో కార్మికులు మండిపడుతున్నారు.

సంక్షేమ బోర్డు లేక సమస్యలు..

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదం జరిగితే ఆదుకునే నాథుడే కరువయ్యాడు. మహా అయితే కాంట్రాక్టర్ ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటాడు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు ఆర్థికంగా.. మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి పాలైనా... మంచం పట్టినా ఆ కార్మికుడి కుటుంబం అప్పులపాలవుతోంది. గతంలో మాదిరిగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఉంటే తద్వారా సాయమందేది. అది పునరుద్ధరణ కాక కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు.

కార్మికుల పొట్ట కొట్టడం తగదు..



కార్మికులకు అందాల్సిన సౌకర్యాలు నిలిపివేయడం దుర్మార్గం. దేశంలో అనేక రాష్ట్రాల్లో వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు అనేక ప్రయోజనాలు అందుతున్నాయి. రాష్ట్రంలో అందుకు భిన్నంగా ఉంది. కార్మికుల డబ్బులు ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలంటూ ఈ నెల 24న నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నాం.

– **ఆర్‌వీ నరసింహారావు**, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్

కార్మికుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదు..



ఓ వైపు ఇసుక కొరతతో పనుల్లేక కార్మికులు ఇంత వరకు బాధలు పడ్డారు. ఇప్పుడిప్పుడే ఇసుక దొరుకుతుందనుకుంటే భవన నిర్మాణ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు అందుబాటులో ఉంటే ఎవరైనా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వస్తారు. నిర్మాణాలు జోరందుకుంటాయి. నిర్మాణ రంగ పని వారికి పనులు దొరుకుతాయి. కానీ ఆ ధరలు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. – **కోట సత్తిబాబు**, ఏఐటీయూసీ

ఏవీఎన్ కాలేజీలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో బుధవారం విశాఖపట్నం లయన్స్‌క్లబ్, గాజువాక లయన్స్ క్లబ్ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు సారథ్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో కళాశాల పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 40 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో నున్నా శ్రీనివాసరావు, అశోక్ అగర్వాల్, మళ్ల మహేష్, చంద్రశేఖర్, కేవీ రావు, డాక్టర్ అయ్యగారి అర్చన, సత్యాల కోటేశ్వరరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో 12 మందికి ఆశ్రయం



వసతి గృహంలో నిరాశ్రయులు

సీతమ్మధార: రైల్వే స్టేషన్ చుట్టు పక్కల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో దీన స్థితిలో ఉన్న 12 మంది నిరాశ్రయులను గుర్తించి ఏయూటీడీ జీవీఎంసీ వసతి గృహాలకు తరలించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. మాధవ (55, మైసూర్), సిరామ్ (50, తమిళనాడు), శ్రీనివాసరావు (45, విజయవాడ), సాయిబాబా (50, బరంపురం, ఒడిశా), మల్లు (45, కర్ణాటక), వెంకటరావు (55, సేవానగర్, విశాఖపట్నం), గోపాల్ (65, బరంపురం, ఒడిశా), శంకర్ (45, మంచిర్యాల, తెలంగాణ), నాగరాజు (55, విజయవాడ), సింహాచలం (50, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా), సుధాకర్ (45, ఒడిశా), దేవ (70, జగదల్పూర్, ఛత్తీస్‌ఘడ్) అనే వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు. వీరిలో మానసిక రోగులకు వైద్యం అందిస్తామని, మిగిలిన వారిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని వాసు తెలిపారు.

20న సిటు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

దాబాగార్డెన్స్: సిటు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 20న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశాలకు సిటు అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ కె. హేమలత, రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావుతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటున్నట్టు తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయని, సమ్మె విజయవంతం, మేడే ఉత్సవాల నిర్వహణకు ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత తేదితర అంశాలపై చర్చలు జరగనున్నాయని, భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్. జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా ప్లేస్‌మెంట్ డ్రైవ్

దాబాగార్డెన్స్: రాంనగర్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో మహా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షాహిద్ ఆలీ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీ టీసీఎస్ (ఐటీ) ఈ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తోందని, 75 మంది హెచ్‌ఆర్‌లు, 900కు పైగా విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొంటున్నట్టు వారు తెలిపారు.

దుర్గమాంబ జాతర నేడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ దొంకాడ గ్రామ దేవత దుర్గమాంబ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సన్నాహాలు చేసింది. ఈ మేరకు ఆలయం వద్ద బుధవారం అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గురువారం తెల్లవారు జాము నుంచి భక్తుల దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జాతర సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. అమ్మవారి అనుపు సందర్భంగా సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వారు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ఆర్టీసీలో డెమో



డెమో నిర్వహిస్తున్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ అధికారులు

దాబాగార్డెన్స్ : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఆధ్వర్యంలో బుధవారం ఏపీఎస్‌ఆర్‌టీసీ ద్వారకా బస్టేషన్ ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై డెమో నిర్వహించారు. అనుకోని విధంగా ప్రమాదం సంభవిస్తే ఎలాంటి చర్యలు చేపట్టాలన్న విషయంపై ఆర్‌టీసీ సిబ్బంది, ప్రయాణికులకు ఉచిత డెమోను జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు తగు సూచనలు చేశారు. ముఖ్యంగా గృహిణులు ఇళ్లల్లో వాడే గ్యాస్ సిలిండర్లు, ఇతర అగ్ని రాజేల్లే పదార్థాల నుంచి మంటలు ఏ విధంగా నియంత్రించాలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఇచ్చిన సూచనలు తప్పకుండా పాటించాలని, ఫలితంగా అగ్ని ప్రమాదాలు నివారించడంతో పాటు విలువైన ప్రాణాలు, వస్తువులు కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టీసీ సూపర్వైజర్లు, సిబ్బంది, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది, ఆర్టీసీ ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటుకు సిఫారసు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

మహారాణిపేట: కేజీహెచ్‌లోని జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రం ఆవరణలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులకు సిఫారసు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన నూతన జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. అనంతరం జరిగిన సమీక్షలో సీతారాం మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల స్వీకరణ, తప్పొప్పుల సవరణ చేసి 24 గంటల్లోగా పత్రాలు అందజేయగలగడం ఉత్తరాంధ్ర బాలల విజయమన్నారు. పుట్టిన బిడ్డ తల్లిదండ్రుల పేర్లలో తప్పులు, వివాహం తర్వాత తల్లి ఇంటి పేరు తండ్రి ఇంటి పేరుగా మార్పు వంటివి నూటికి నూరు శాతం తప్పులు లేకుండా అందించడంపై ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తన దృష్టికి తెచ్చారని అన్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఆధార్ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వి.రవి, ఆంధ్రా మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.వి.రమణ, సి.ఎస్.ఆర్.ఎం.వో. జి.మెహర్ కుమార్, చిన్న పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రసూతి విభాగం వైద్యులు డాక్టర్ కె.శ్యామల, డాక్టర్ సువిధ, స్టాటిస్టికల్ అధికారి దయానిధిరావు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ శంకరరావు, నోడల్ ఆఫీసర్ శ్రీకళ, ఎంఆర్‌వో ఎం.ఎస్.జవహర్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం.వి.రమణ కుమారి, శ్రీలత, ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.మమత, వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధులు శరణ్య, మాలతి, శాంత, సుజాత, రామలక్ష్మి, కౌన్సిలర్ శకుంతల, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

23న ఎస్.జానకి పాటల సంగీత విభావరి

ఎంవీపీకాలనీ: ప్రముఖ గాయని ఎస్.జానకి జన్మదిన వేడుకలు ఈ నెల 23న మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా జరగనున్నాయి. యాక్మి, చౌదరి క్రియేషన్స్, ఎంవీఆర్ ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఎంవీపీ కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా ఎస్.జానకి పాడిన పాటలతో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నట్టు యాక్మి అధ్యక్షుడు ప్రతాప్ తెలిపారు. మిలీనియం శేఖర్ ఆర్కెస్ట్రా ద్వారా సింగర్లు మాళవిక, హితేష్ సాయి తదితరులు మధురగీతాలను ఆలపిస్తారన్నారు. ప్రముఖ ఫ్లూట్ మాస్ట్రో తాళ్లూరి నాగరాజు, మణి దంపతులను సత్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

10,11 తేదీల్లో సీపీఐ మహాసభలు



మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మరుపిళ్లి పైడిరాజు తదితరులు

అల్లిపురం: సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం అల్లిపురం, సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీపీఐ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జిల్లా పార్టీ మహాసభలు ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీ సాయంత్రం కంచరపాలెం మెట్టు నుంచి ఓల్డ్ ఐటీఐ జంక్షన్ వరకు ప్రజా ప్రదర్శన ఉంటుందన్నారు. 11వ తేదీన మురళీనగర్‌లో గల బిస్వేర్ ఫంక్షన్ హాల్లో ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాలలో నిర్వహించిన ఉద్యమాలపై సమీక్ష ఉంటుందన్నారు. అదే విధంగా రాబోవు మూడు సంవత్సరాలలో ఉద్యమ రూపకల్పన చేసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, పాత్రపల్లి చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎస్.కె.రెహమాన్, ఎం.మన్మధరావు, సీఎస్ క్షేత్రపాల్, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని బతికించుకుందాం



మాట్లాడుతున్న ఆచార్య నరసింహారావు



గోపాత్రుడు నాటికలోని ఓ సన్నివేశం

విశాఖ విద్య: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా బుధవారం ఏయూ ఓపెన్ థియేటర్‌లో తెలుగు నాటకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి వర్సిటీ ఆచార్యులతో కలసి నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరేశలింగం జయంతిని నాటక రంగ దినోత్సవంగా ప్రకటించడం నాటక రంగానికి గుర్తింపు దక్కినట్లేనన్నారు. కళలకు పుట్టినిల్లు ఉత్తరాంధ్రలో నాటక రంగానికి నేటికీ మంచి ఆదరణ లభిస్తోందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. సమాజం ఉన్నంత వరకు నాటకం బతికే ఉంటుందని పేర్కొన్నారు. సమాజ ఇతివృత్తాలను కళ్లకు కట్టినట్లుగా చూపించే అవకాశం ఒక్క నాటక రంగంలోనే ఉంటుందని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీలో థియేటర్ ఆర్ట్స్ విభాగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా తగిన ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రదర్శించిన గోపాత్రుడు నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.శశిభూషణ్‌రావు, ఆచార్య ప్రేమనందం, ఆచార్య విజయ్‌మోహన్, ఆచార్య పల్లవి, డైరెక్టర్ డా.కిరణ్‌కుమార్, డా.రాజేంద్రప్రసాద్, పితాని ప్రసాద్, డా.వీర్‌కుమార్, హేమ వెంకటేశ్వరి, దుర్గారావు, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

నటులందరికీ మార్గదర్శకుడు చార్లీ చాప్లిన్



చార్లీ చాప్లిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రపంచ హాస్య నటుడు చార్లీ చాప్లిన్ జయంతి ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు తదితరులు చాప్లిన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ నటనలో తనదంటూ ప్రత్యేక శైలిని అలవర్చుకున్న చాప్లిన్ విశ్వ మానవుడని, నటులందరికీ మార్గదర్శకుడని కొనియాడారు. అనంతరం చాప్లిన్ నటించి, దర్శకత్వం వహించిన మోడరన్ టైమ్స్ చిత్రాన్ని ప్రదర్శించారు. సంస్థ కోశాధికారి హుస్సేన్, జాయింట్ సెక్రటరీ చాట్ల బాబూరావు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్తు



సమావేశంలో పాల్గొన్న అతిథులు

విశాఖ విద్య: భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా నడుస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా బుధవారం నిర్వహించిన బిల్డ్ భారత్ హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత మేధస్సుకు పదును పెట్టే విధంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత ఇక్కడ నుంచి స్ఫూర్తిని పొంది నూతన అంకుర సంస్థలను స్థాపించేలా అడుగులు వేయాలన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల నుంచి 488 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. యువతను ప్రోత్సహించడం, వారి ఆలోచనల నుంచి అనేక సమాజ ఉపయుక్త పరిష్కారాలను తీసుకురావడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు పాల్గొన్నారు.